# ఆశతో కాదు.. ఆశయంతో వచ్చిన

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW



మాట్లాడుతున్న వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

- నేను ఈ గడ్డ బిడ్డను.. మీ సేవకుడిని
- రాజకీయాలు నాకు కొత్త కాదు
- ఈ ప్రాంతం గురించి నాకు పూర్తిగా తెలుసు
- ఇక్కడి యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నదే నా సంకల్పం
- ఎములాడ రాజన్న దయతో బీఆర్ఎస్ అభ్యర్థిగా మీ ముందున్న
- ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్త
- కేటీఆర్ దత్తత హామీ వరంలాంటింది
- 'నమస్తే' ప్రత్యేక ఇంటర్వ్యూలో వేములవాడ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ఆశతో కాదు, ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతో వస్తున్నానని, తనను ఆశీర్వదించాలని వేములవాడ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు విజ్ఞప్తి చేశారు. తన సొంతూరు మల్కపేటేనని, ఈ ప్రాంత పిల్లలు, యువత మంచి విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నది తన లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకే విద్యా, వైద్య సేవలతో ప్రజల మధ్యనే ఉన్నానని, ఏములాడ రాజన్న దయతో మీసేవకుడిగా వస్తున్నానని చెప్పారు. తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత ఆదర్శంగా నిలిపేందుకు శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు చాలా పనులు చేశారని, మిగిలిపోయినవన్నీ తాను పూర్తి చేస్తానని చెప్పారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుంటానని చెప్పడాన్ని ఈ ప్రాంత ప్రజలు స్వాగతిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రచార తీరుతెన్నులు.. ప్రజల నుంచి వస్తున్న స్పందనను, తాను గెలిపిస్తే చేయబోయే పనులను వివరించారు.

**నమస్తే : ముందుగా మీ గురించి చెబుతారా..?**

చల్మెడ లక్ష్మీనరసింహారావు : నాది ఈ గడ్డనే. మా సొంతూరు కోనరావుపేట మండలం మల్కపేట. ఇక్కడే పుట్టి పెరిగిన. తంగళ్లపల్లి మండలం చింతలఠాణా, కోరెం, రుద్రంగి, మానాలల్లో మా మేనత్తలున్నరు. మాఊరిలో వ్యవసాయం కూడ చేసిన. ఎప్పుడు సెలవుదొరికినా మా కుటుంబంతో కలిసి ఊరికొస్త. గ్రామస్తులందరితో కలిసి సరదాగా గడపడం, పల్లె వాతావరణమంటే నాకెంతో ఇష్టం. ఈ ప్రాంతం గురించి నాకు పూర్తి అవగాహన ఉన్నది. ఇది నాడు వెనుకబడ్డ ప్రాంతం. తెలంగాణ వచ్చినంక అభివృద్ధి చెందుతున్నది. ఈ ప్రాంత పిల్లలు, యువతీ యువకులు మంచి విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నది నా ఆశయం. అందుకే విద్యా, వైద్య సేవలతో ప్రజల ఎప్పుడు ప్రజల మధ్యే ఉన్న.

**నమస్తే : మీ రాజకీయ నేపథ్యం గురించి వివరిస్తారా..?**

చల్మెడ : నాకు రాజకీయాలు కొత్తకాదు. మా నాన్న చల్మెడ ఆనందరావు వృత్తి రీత్యా న్యాయవాది. 30ఏళ్ల క్రితం ఎమ్మెల్యేగా ఎన్నికైండు. 1989లో న్యాయశాఖ మంత్రిగా పనిచేసిండు. గతంలో కూడా నేను పోటీ చేసిన. ఇది కొట్లాట కాదు. ఆశతో కాదు, ఒక ఆశయంతో వచ్చిన. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా, సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తిగా బరిలోకి దిగిన. ఇది నా సొంత నియోజకవర్గం. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తున్నది. ప్రతిపక్ష పార్టీల మాటలు అంతా బూటకం. వారంటీ లేని పార్టీ గ్యారెంటీ ఇస్తుందంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. వాళ్ల మాటల్ని నమ్మడం లేదు.

**నమస్తే : మీ ప్రచారం ఎలా సాగుతున్నది? ప్రజా స్పందన ఎలా ఉన్నది?**

చల్మెడ: నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. నేను, మా పార్టీ నాయకులు, కార్యకర్తలందరం కలిసి గ్రామగ్రామానికీ వెళ్తున్నాం. అన్ని గ్రామాల్లోనూ ప్రజల స్పందన బాగున్నది. ఏ ఊరికెళ్లినా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన బీఆర్ఎస్ సర్కారుపై విశ్వాసం చూపుతున్నారు. భవిష్యత్తుకు బాటలు వేసేది కేసీఆరేనని, మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటామని చెబుతున్నారు. మొన్న మంత్రి కేటీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు, రోడ్‌షోలకు వేలాదిగా తరలివచ్చారు. నన్ను భారీ మెజార్టీతో గెలిపిస్తే వేములవాడను దత్తత తీసుకుంటానని, సిరిసిల్ల నియోజకవర్గం తరహాలో అభివృద్ధి చేస్తానని మంత్రి ప్రకటించడాన్ని నియోజకవర్గ ప్రజలంతా స్వాగతించారు. ప్రజల స్పందనను చూస్తే నా గెలుపు ఖాయమని స్పష్టమవుతున్నది.

**నమస్తే : మీరు గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తారు?**

చల్మెడ: ఇప్పటికే మా ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు చాలా సమస్యలు పరిష్కరించిండు. మిగిలిపోయిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్త. అక్కడక్కడ రోడ్లు ఇతర చిన్న చిన్న సమస్యలున్నయి. చాలా మందికి పింఛన్లు రావాల్సి ఉంది. డబుల్ బెడ్రూం ఇండ్లు, వృద్ధాప్య, బీడీ పింఛన్లు ఇప్పించేందుకు కృషి చేస్త. వేములవాడను మోడల్‌టౌన్‌గా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు పనిచేస్త. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న, బద్దిపోచమ్మ ఆలయాలను అభివృద్ధి చేస్త. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది. వీటీడీఏ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నయి. ఆలయాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నది. యాదాద్రి ఆలయ పునర్నిర్మించడం దేశ చరిత్రలో సువర్ణధ్యాయం. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోని 32 ఎకరాల భూమి సేకరణ పూర్తయింది.

**నమస్తే : ముంపు గ్రామాల సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?**

చల్మెడ: అసలు ముంపు గ్రామాలను సమస్యల్లోకి తోసిందే కాంగ్రెస్ పార్టీ. 2004లో మధ్యమానేరు ప్రాజెక్టు మొదలైనప్పుడు సర్వే ప్రకారం ఏయే గ్రామాలు మునిగి పోతాయో..? ఎంత భూమి మునిగి పోతుందో..? సర్వేలు తేల్చినయి. అధికారులు పూర్తి స్థాయిలో రిపోర్టు కూడా ఇచ్చిన్రు. 2004 నుంచి 2014వరకు కాంగ్రెస్ గవర్నమెంటే పవర్‌లో ఉన్నది. సమస్యను సమస్యగా పెంచుకుంటూ వచ్చిందే తప్ప పరిష్కరించలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు బిడ్డగా సీఎం కేసీఆర్ ముంపు గ్రామాల ప్రజల త్యాగాలను వెలకట్టలేమని చెప్పిండు. వారిని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకునే ప్రయత్నం చేసిండు. మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రితో మాట్లాడి 18 ఏండ్లు నిండిన యువతకు సైతం పరిహారం ఇప్పించిండు. 95శాతం సమస్యలు పరిష్కారమైనయి. మిగిలిన 5శాతం చిన్న చిన్న సమస్యలున్నయి. వాటన్నింటినీ పరిష్కరిస్త.

**నమస్తే : ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏం చేయబోతున్నారు?**

చల్మెడ: విద్యతోనే ఉపాధి అవకాశాలు లభిస్తయి. ముఖ్యంగా ఈ ప్రాంత యువతకు మంచి విద్య అందాలన్నది నాసంకల్పం. ఆ లక్ష్యంతోనే మా ఊరు మల్కపేటలో మా తల్లి చల్మెడ జానకీదేవి పేరిట ₹2 కోట్లతో ఆధునిక పాఠశాల కట్టించినం. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నం. ఈ సేవలను నిరంతరం కొనసాగిస్తం. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పిస్త. మంత్రి కేటీఆర్‌తో కలిసి పరిశ్రమల ఏర్పాటుకు, యువత, మహిళలకు ఉపాధి కల్పించేలా ప్రయత్నాలు చేస్త. ఇప్పటికే మంత్రి కేటీఆర్ సిరిసిల్ల అప్పారెల్ పార్కుకు గార్మెంట్ పరిశ్రమలు తెప్పించిండు. గ్రీన్‌నిడిల్ కంపెనీ వెయ్యి మంది మహిళలకు ఉపాధి కల్పించింది. టెక్స్‌పోర్టు ఇండియా కంపెనీ త్వరలో ప్రారంభం కాబోతున్నది. అందులో రెండు వేల మందికి ఉపాధి దొరుకుతుంది. చీర్లవంచలో అతిపెద్ద ఆక్వాహబ్ యూనివర్సిటీ, పరిశ్రమలు రాబోతున్నయి. వీటి ద్వారా 5వేల మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. నంది కమాన్ వద్ద పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం వద్ద ప్రణాళికలున్నయి.

**నమస్తే : ప్రజలకు ఏం చెబుతారు?**

చల్మెడ : యాభై ఏండ్లు అధికారంలో ఉన్న పార్టీలు మన ప్రాంతానికి చేసిందేమి లేదు. సాగు, తాగునీటికి తండ్లాడిన మెట్ట ప్రాంతం మనది. నీళ్లులేక నెర్రెల బారిన భూములతో రైతులు అరిగోస పడ్డరు. ఎత్తిపోతల పథకం చేపట్టాలని దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు అప్పటి ప్రభుత్వాలకు అనేక సార్లు ప్రతిపాదనలు పంపించిండు. అసెంబ్లీలో ప్రస్తావించిండు. అయినా నాటి ప్రభుత్వాలు పట్టించుకోలే. ఇక్కడ రైతాంగాన్ని ఆదుకోలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెచ్చిండు. నాటి పాలకులు మధ్యలోనే వదిలేసిన మధ్యమానేరు జలాశయాన్ని పూర్తి చేయించిండు. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని కాళేశ్వరం 9వ ప్యాకేజీ ద్వారా మల్కపేట రిజర్వాయర్ నిర్మించిండు. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా ఎగువ మానేరును నింపే పనులు పూర్తయినయి. మల్కపేట రిజర్వాయర్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. సాగు, తాగునీటి గోస తీరింది. నాడు పనులు లేక దుబాయి, భీవండీలకు వలస పోయిన వారంతా మళ్లీ తిరిగి వాపస్ వస్తున్నరు. ఇంకా ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు శాయశక్తులా కృషి చేస్త. మన నియోజకవర్గం ఇతర రాష్ట్రాల నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా అభివృద్ధి చెందాలి. విద్యా, వైద్యం అందరికీ అందాలి. అదే నా ఆశయం. పరిశ్రమ, వైద్య రంగాల్లో అనుభవమున్నవాడిగా చెబుతున్న. నియోజకవర్గ ప్రజలు మంచిగా ఆలోచించాలి. యాభై ఏండ్లలో జరగని అభివృద్ధిని కేవలం పదేండ్లలో కేసీఆర్ చేసి చూపిండు. చేసిన అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తున్నది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరుతున్న. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌కు పట్టం కడితే ఇంకా అభివృద్ధి జరుగుతుంది. వేములవాడ ఆదర్శ నియోజకవర్గంగా మారుతుంది.

# కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఆ మేరకు కంకణబద్ధులు కావాలి
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించాలి
- వారియర్స్ అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల బూత్ స్థాయి ఇన్‌చార్జిలు, వారియర్స్‌తో సమావేశం




**సిరిసిల్ల తెలంగాణభవన్‌లో బూత్ స్థాయి ఇన్‌చార్జిఎన్నికల వారియర్స్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్**

సిరిసిల్ల/ సిరిసిల్ల టౌన్, నవంబర్ 16 : రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి, సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్‌ను గతంలో కంటే భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో కంకణబద్ధులై కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల తెలంగాణభవన్‌లో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల పోలింగ్ బూత్ స్థాయి బీఆర్ఎస్ కమిటీ ఇన్‌చార్జిలు , ఎన్నికల వారియర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ వ్యూహాలపై పలు సూచనలు, విధివిధానాలను ఆయన వివరించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో విశదీకరించారు. ఎన్నికల వేళ అమలు చేయాల్సిన విధివిధానాలను, గురుతర బాధ్యతలను ఎలా నిర్వర్తించాలనే అంశాలనే వివరించి చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిపెస్టోను ప్రజలకు సవివరంగా వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిన, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి మరోసారి గుర్తు చేయాలని సూచించారు. పార్టీ అవిర్భావం నుంచి ఇప్పటివరకు సాగిన ఉద్యమ, ప్రభుత్వ పాలన సాధించిన విజయాలను, ఇంకా సాధించాల్సిన అంశాలను సుదీర్ఘంగా ఓటర్లకు వివరించాలన్నారు. పోలింగ్ బూత్‌లో వారియర్స్ అప్రమత్తంగా ఉండాలని, ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా పడేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, మూడు మండలాల పార్టీ పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

## 'సుంకెను గెలిపించండి'

కొడిమ్యాల, నవంబర్ 16: మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాచుపల్లిలో ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, నర్సింగపూర్‌లో జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశం ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి రవిశంకర్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

## చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన సీపీ

చొప్పదండి(రామడుగు), నవంబర్16: చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వెలిచాల క్రాస్ రోడ్ వద్ద గల స్టాటిక్ సర్వేలెన్సు టీం చెక్ పోస్ట్‌ను గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్‌మహంతి ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది, బీఎస్ఎఫ్ పోలీసులకు పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలీస్ వాహనాలతో సహా అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన వాహనాలను సైతం తనిఖీ చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.